క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీమహాలక్ష్మీ పేరంటాల ఆరాధనా మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం మహాలక్ష్మీ పేరంటాలకు నిత్య హారతి, కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి, పూజాక్షింతలను తలపై చల్లుకున్నారు. అనంతరం సుమారు 200 మంది పేదలకు ఆలయ ధర్మకర్త నారాయణరావు దంపతులు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారిని తిరువీధిలో ఊరేగించారు.

ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలి

పాలకొండ: నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలని కమిషనర్ సర్వేశ్వరరావు ఆదేశించారు. శనివారం సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన ప్లాస్టిక్ నిషేధం అమలుపై పలు సూచనలు చేశారు. ప్రతి రోజు తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు వ్యాపారులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వినియోగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అపరాధ రుసుం విధించడంతో పాటుగా షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.

300 మందికి అన్నసంతర్పణ

పాలకొండ: పట్టణంలోని వెంకటరాయుని కోనేరు గట్టుపై పూర్వపు విద్యార్థుల గ్రంథాలయం ఆవరణలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన సాహిని సతీష్‌కుమార్, మాధవి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వహకుడు ప్రసాదరావు తెలిపారు. సుమారు మూడు వందల మందికి అన్నసంతర్పణ చేశారు.

నిర్మాణంలో జాప్యం వద్దు


మినీగోదాం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ కృష్ణమోహన్

భామిని: సహకార సొసైటీలకు మంజూరు చేసిన మినీగోదాంల నిర్మాణాలు జాప్యం లేకుండా పూర్తి చేయాలని టీడబ్ల్యూ డీఈఈ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని బిల్లుమడ, భామినిలో నిర్మాణంలో ఉన్న మినీగోదాంలను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సైట్ ఇంజినీర్ సీహెచ్ భీష్మ, కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. శనివారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్ 1/2019ను కొనసాగించాలని కోరారు. డిపో మేనేజర్ కక్షసాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎ.ఎస్ నాయుడు, టీకే రావు, కాద రాము, దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు రైతుల వినతి

భామిని: ఏనుగుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పసుకుడికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ నీలాపు అప్పారావును కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మూడురోజులుగా పసుకుడిలో ఏనుగులు తిష్ట వేశాయని, పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించడంతో పాటు పంటలు నష్టపోయిన బాధితులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రైతులు బి.రవినాయుడు, వై.ఢిల్లీశ్వరరావు, దామోదర బారికి, వలరౌతు కాంతారావు తదితరులు ఉన్నారు.

7న వాహనాల వేలం

జియ్యమ్మవలస: సారా కేసులో పట్టుబడిన రెండు బైకులు, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు చినమేరంగి ఎస్సై అనీష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 7న స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వాహనాలు వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

• అవగాహన


మానవహారంగా ఏర్పడిన డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వి.పెదరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవ హారం చేపట్టారు. ప్రపంచ వ్యాప్తంగా అధికంగా మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటని, సరైన జీవన శైలి, ఆహార అలవాట్లు, రెగ్యులర్ చెకప్‌లు, ముందస్తుగా గుర్తించడం, చికిత్స చేయడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

• అధ్యయనం

సీతంపేట: గిరిజన సంస్కృతి సంప్రదాయాలపై సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ విజయనగరం ప్రొఫెసర్ల బృందం అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని గాటిగుమ్మ, ఇప్పగూడ, అడ్డాకులగూడ తదితర గిరిజన గ్రామాల్లో ప్రొఫెసర్ల బృందం శనివారం పర్యటించింది. ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలు, మార్కెటింగ్ సదుపాయం, వారి జీవన విధానం, సంప్రదాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీఓ నవ్యను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ బృందంలో ప్రొఫెసర్లు అప్పసబ, మండల గంగునాయుడు, ప్రేమ్ చటర్జీ, దివ్య, నోడల్ ఆఫీసర్ డెబంజన నాగ్ ఉన్నారు.


కొంచీపుర్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ల బృందం

• ఆరోగ్యం


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ జానకిరామయ్య

సీతంపేట:

మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 570 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 17 మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆప్తాలమిస్ట్ జానకిరామయ్య తెలిపారు. 46 మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ నీలవేణి, ఏఎన్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి


కొమరాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు


పాలకొండ రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ, తదితరులు

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించేలా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మా ణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి అవసరాలపై ఆరా తీశారు. కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్, తాగునీరు, రోడ్లు, ఇతర సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులు చేపడుతున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు నిర్మాణ సామగ్రి అందిస్తున్నామన్నారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొమరాడ: గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అమల చేస్తున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులందరికీ పని కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యాశాఖ అధికారి జామి నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఫేషియల్ హాజరు తప్పనిసరి


శివ్వాం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా ఫేసియల్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని శివ్వాం, కొత్తూరు పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి వారి సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని, భోజనం నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సచివాలయ సేవలపై ఎంపీడీఓ ఆరా


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. ఉల్లిభద్ర గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. రికార్డులు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గ్రామంలో అర్హులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఇంటిపన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు.

రూ 5.41 కోట్లతో ఇంటింట కుళాయి పనులు


అండర్ గ్రౌండ్‌లో వేయాల్సిన పైప్‌లను పరిశీలిస్తున్న డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలో ఇంటింట కుళాయి పనులను నాణ్యత ప్రమాణాలకు లోబడి వేగవంతంగా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. గెడ్డలుప్పిలో జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ.39 లక్షలతో చేపడుతున్న ఇంటింట కుళాయి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో మండలంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.5.41కోట్లలో మొదట, రెండో విడతగా 19 గ్రామాల్లో ఇంటింట కుళాయిల నిర్మాణ పనులు మంజూరైనట్లు తెలిపారు. అంటిపేటలో రూ.37 లక్షలు, వెంకటాపురం రూ.19లక్షలు, వీబీపేట రూ.18 లక్షలు, బగ్గందొరవలస రూ.31 లక్షలు, బళ్ళక్రిష్టాపురం రూ.25 లక్షలు, బూర్జ రూ.27 లక్షలు, చినబోగిలి రూ.24 లక్షలు, గెడ్డలుప్పి రూ.39లక్షలు, గుచ్చిమి రూ.59 లక్షలు, గుచ్చిమి సీతారాంపురం రూ.16 లక్షలు, గాదెలవలస రూ.58 లక్షలు, జోగింపేట రూ.10 లక్షలు, కేఎస్‌పురం రూ.16 లక్షలు, కాశీపేట రూ.37 లక్షలు, లచ్చయ్యపేట రూ.11 లక్షలు, బుడ్డిపేట రూ.24 లక్షలు, అప్పయ్యపేట రూ.31 లక్షలు, రామవరం రూ.27 లక్షలు, రెడ్డివానివలస గ్రామానికి రూ.16 లక్షల వంతున నిధులు మంజూరైనట్లు తెలిపారు. సుజలధార పథకం ద్వారా మరికొన్ని గ్రామాలకు మంచినీటి పథకాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గెడ్డలుప్పిలో రూ.39 లక్షల వ్యయంతో చేపడుతున్న ఇంటింట కుళాయిల పథకం ద్వారా 400 ట్యాప్‌లు అమర్చాల్సి ఉందన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరామన్నారు. ఏఈ రావుపల్లి పవన్‌కుమార్, సర్పంచ్ తిరుపతిరావు, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కె.వెంకయ్య పంచాయతీ కార్యదర్శి మోహనరావు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

కట్టెజనుము సాగు పరిశీలన


కట్టె జనుము సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాలకొండ రూరల్: మండంలోని పీఆర్.రాజుపేటలో అభ్యుదయ రైతు కండాపు ప్రసదారావు పండిస్తున్న నూతన కట్టెజనుము పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. విజయనగరం జిల్లా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కె.స్వాతి, కె.తేజేశ్వరరావు శనివారం గ్రామానికి చేరుకుని రైతుతో మాట్లాడి పంట సాగుపై ఆరాతీశారు. సదరు రైతు వేసిన సువిన్, ఎస్‌హెచ్‌-4 రకం కట్టె విత్తనాలను పరిశీలించారు. రెండు నెలల క్రితం అందించిన ఈ విత్తనాలతో అధిక దిగుబడితోపాటు భూమికి మంచి పోషణ లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆసక్తి గల రైతులకు తేనేటీగల పెంపకంపై శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్‌డీసీ కార్యాలయం ఎల్విన్‌పేటకు తరలించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురంలో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటకు (యథాస్థానానికి) తరలించాలని గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల ఉపప్రణాళిక మండలాల్లోని షెడ్యూల్ ఏరియా లో 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేసి, గిరిజన ప్రాంతాల్లో భూముల రక్షణ కల్పించేందుకు ఎల్విన్‌పేటలో ఏర్పాటు చేసిన ఎస్‌డీసీ కార్యాలయాన్ని మూడేళ్ల కిందట పార్వతీపురానికి తరలించారని, గిరిజనులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సి న ఈ కార్యాలయం ఇప్పుడు గిరిజనులకు దూరమైందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఎస్‌డీసీ కార్యాలయాన్ని యథావిధిగా గిరిజనులకు అందుబాటులో ఉండే ఎల్విన్‌పేటలో నిర్వహించేలా చొరవ చూపాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.9,37,110

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించారు. దేశదాయశాఖ అధికారుల సమక్షంలో ఆలయ సిబ్బంది హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 81 రోజులకు గాను హుండీ ద్వారా రూ.9,37,110 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాధాకృష్ణ తెలిపారు.

ఎరువు దుకాణాల తనిఖీ

బలిజిపేట: బలిజిపేటలోని ఎరువుల దుకాణాలను పాలకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి శనివారం పరిశీలించారు. గలావల్లి, గంగాడ, వంతరాం, బలిజిపేటలలో ఉన్న ఎరువుల దుకాణాలు పరిశీలించారు. షాపులలో రికార్డులు, స్టాక్ వివరాలు సక్రమంగా ఉండాలని సూచించారు. షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని వాటిపై ధరలు రాసి ఉంచాలన్నారు. గలావల్లిలో ఎస్ఆర్ ఫెర్టిలైజర్స్‌కు రూ.2,00,164, గంగాడలో జీఎస్ ట్రేడర్స్‌కు రూ.63,496లకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఎటువంటి ఫిర్యాదులు అందినా వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందని రత్నకుమారి తెలిపారు.

వేతనదారుల హాజరు పెంచాలి


పాలకొండ రూరల్: ఉపాధి వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ


సీతంపేట: ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

పాలకొండ రూరల్: ఉపాధి పనులు జరుగుతున్న చోట వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డు పొందిన ప్రతి ఒక్కరూ పనులకు హాజరయ్యేలా సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలోని వెలగవాడలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేపడుతున్నవారికి నిర్దేశిత వేతనం అందుతుందన్నారు. ప్రణాళికతో పనులు చేపట్టి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

సీతంపేట: మండలంలోని పులిగుమ్మి గ్రామం పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ కోసూరు గీతాంజలి శనివారం పరిశీలించారు. పనికి హాజరైన వేతనదారుల మస్తర్లు పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయించాలని, ప్రతీ వేతనదారుకు రూ.257 వేతనం వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువులను పరిశీలించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంలో భాగంగా ఆదివారం పవిత్ర నాగావళి నదీ తీరంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు తెలిపారు. ఉదయం నిత్యారాధన, విశేష హోమాలు, మంగళ శాసనం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం 8 గంటలకు నాగావళి నదిలో వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారికి చక్రస్నానం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు ఉష

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామానికి చెందిన మర్రాపు లక్ష్మునాయుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి వచ్చిన పింఛన్ తీసుకోలేని స్థితిలో ఉండడంతో గ్రామ వలంటీర్ గుంట్రెడ్డి ఉష శనివారం 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. అలాగే కిమ్మి గ్రామానికి చెందిన మరో వృద్ధుడు కూడా జెమ్స్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుండడంతో గ్రామ వలంటీరు రాము ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

విగ్రహాల ప్రతిష్ట


పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలం పసుకుడిలో శనివారం హరే రామ హరేకృష్ణ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కార్తీకమాసంలో హరేరామ హరేకృష్ణ అఖండ భజన నిర్వహించేందుకు వీలుగా మందిరాన్ని నిర్మించి అందులో శ్రీకృష్ణుడు, చైతన్య మహాప్రభువు విగ్రహాలను ప్రతిష్ఠించారు. పసుకుడి సర్పంచ్ బెవర భార్గవనాయుడు, పాలసొసైటీ చైర్మన్ బి.ఆనందరావు ఆధ్వర్యంలో ఈ మందిరాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీనబంధు గౌడో, గ్రామస్తులు పాల్గొన్నారు.

10 నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు


నూతనంగా నిర్మించిన రామ మందిరం

గరుగుబిల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ, గ్రామ పురోహితులు అంపోలు కృష్ణమూర్తి శాస్త్రి పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 12న అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

సాయం చేయడంలో 'దొర'

గుమ్మలక్ష్మీపురం:

ఎవరైనా చనిపోయాక అంత్యక్రియల అనంతరం దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంతో పాటు వారి బంధువులకు ఓ పూట ఉచితంగా భోజనం పెడుతున్న మద్ది దొరబాబు సాయం ఎంతో గొప్పదని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. శనివారం సుందరయ్య కాలనీకి చెందిన సూర్యారావు మృతి చెందడంతో సర్పంచ్ గౌరీశంకరరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి దొరబాబు సమకూర్చిన భోజనాలను అందించారు. దొరబాబు మాట్లాడుతూ గ్రామంలో కుల, మతాలకు అతీతంగా దుఃఖంలో ఉన్న ప్రతీ కుటుంబానికి భోజనాలు పెడుతున్నానని, భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు.

చిన్నారులకు పింఛన్ మంజూరు


చిన్నారి తల్లికి పింఛన్ అందచేస్తున్న సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, తదితరులు

కురుపాం: మండలంలోని కిచ్చాడ పంచాయతీ కేంద్రానికి చెందిన రెడ్డి కిశోర్, లలిత దంపతుల ఇద్దరు పిల్లలు రెడ్డి విశాల్, రెడ్డి నిశాల్ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. ఇటీవల వారు వైఎస్సార్ పింఛన్ కానుక కోసం దరఖాస్తు చేసుకోగా.. ఈ నెల వారికి పింఛను మంజూరైంది. దీంతో సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ చంద్రశేఖర్ శనివారం ఆ ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛను మొత్తం రూ.10వేలు అందజేశారు. ప్రభుత్వం తమ పిల్లలకు పింఛను మంజూరు చేయడంతో వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పైల సత్యంనాయుడు, గృహసారథి కోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.